25-5-2000 ఆంధ్రప్రభ

# ఏ మంచికి నాంది? ఏ పథకానికి ప్రారంభం?

**నీటి వనరుల పేరుమీద జరిగిన జన్మభూమి అత్యధిక గ్రామాలలో నీటి గురించి ఒక్క ప్రణాళిక కూడా రూపొందించకుండా గడచిపోయింది. ఎడారి అయిపోతున్నదని పత్రికలన్నీ ఘోషిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా గట్టు మండలంలో సైతం ఏ ఒక్క గ్రామంలోనూ ఒక కొత్త పథకం చేపట్టడానికి నిర్ణయం చేయకుండా ముగిసిన నీటి జన్మభూమిని గురించి ఏమనాలి? సాగునీటి సంగతి దేవుడెరుగు, కనీసం తాగునీటికి కూడా కొత్తగా ఏర్పాట్లు చేసిన గ్రామాలు వేళ్లమీద లెక్క పెట్టొచ్చు.**



కె.బాలగోపాల్

చంద్రబాబు నాయుడు మొన్న జరిగిన 12వ జన్మభూమికి 'నీరు—మీరు' అని పేరు పెట్టారేతప్ప 'నీరు—మనం' అని పేరు పెట్టలేదనేది కేవలం జోక్ కాదని కరవు ప్రాంతాల రైతులతో మాట్లాడితే అర్థంఅవుతుంది. పేరును బట్టి పథకాన్ని లేక ప్రణాళికను వ్యాఖ్యానించడం న్యాయం కాదంటే ఒప్పుకోవలసిందే కానీ, పథకాన్ని చూసిన తరువాత దానికి తగిన పేరు పెట్టారనిపిస్తే అప్పుడు పేరు గురించి వ్యాఖ్యానించడం తప్పుకాదు.

రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా, ఆ ఊరి నీటివనరుల పెంపుదల గురించి రైతులకు ఒక అభిప్రాయం ఉంటుంది. ఎంత పూర్తిగా వెనుకబడిన ప్రాంతంలోని ఎంత చిన్న కుగ్రామమైనా దీనికి మినహాయింపుకాదు. ఊరి సమీపంలో ఉన్న ఫలానా చెరువుకు పూడిక తీసి కట్ట మరమ్మతుచేస్తేనో, ఆ చెరువులోకి వచ్చే ఫలానా వాగుకో, వంకకో గట్లు కట్టి నీరు వృథా కాకుండా చెరువులో చేరేటట్టుచూస్తేనో, వేరొక వాగుకో, వంకకో చెక్‌డ్యాం కట్టి ఊట చెరువు తయారుచేస్తేనో, ఫలానా దిక్కున ఉన్న చేలల్లో వాటర్ షెడ్ చేపడితేనో నీటివనరులు మెరుగవుతాయని ప్రతిఊరిలోనూ రైతులు చెబుతారు. ఆంధ్ర ప్రాంతం సంగతేమోగానీ తెలంగాణా, రాయలసీమలలో రైతులిప్పుడు చెరువులను, కుంటలను పొలాలకు నీరు పారించుకునే వ్యవస్థలుగా కాక, భూగర్భజలాలను పెంపొందించి బావులలోనూ, బోర్లలోనూ నీటిఊట పెంచే ఏర్పాటుగానే చూస్తున్నారు. ముఖ్యమంత్రి భూగర్భజలాల సంరక్షణ గురించి మాట్లాడడం మొదలుపెట్టక ముందే రైతుల ఆలోచనలో ఈ మార్పు వచ్చినట్టుంది.

ఒక్కొక్క గ్రామంలో రైతులు చేసే సూచనలలో నిర్దిష్టత చాలాఉంది. చెరువులతో వారికి కొన్ని శతాబ్దాల పరిచయం ఉందికాబట్టి ఆ సూచనలు చాలా వరకు సహేతుకమైనవే. సాంకేతికంగా అసాధ్యమైనవికావు. ఒక సమస్య ఏమిటంటే, ఒక ఊరి నీటి సమస్య పరిష్కారానికి ఆ ఊరివాళ్లు చేసే సూచన కొన్ని సందర్భాలలో పొరుగూరి నీటిసమస్యను పెంచవచ్చు. లేదా అదేఊరిలో కొందరు సాగు చేసుకుంటున్న భూముల ముంపునకు దారితీయవచ్చు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహాయం అవసరం కావచ్చు.

పథకాల అమలుకయ్యే ఖర్చు విషయంలోనూ ప్రభుత్వం సహాయం కొంతమేరకు అవసరం అవుతుంది. గ్రామస్తులు ఎంత శ్రమదానం చేసినా కొంత పెట్టుబడి ప్రభుత్వం నుండి రావలసి ఉంటుంది.

రైతుల ఆలోచనలను, ప్రభుత్వం చేయగల ఈ రెండు సహాయాలను దృష్టిలో ఉంచుకొని ఒక్కొక్క ఊరిలోనూ పథకాలు తయారు చేయవచ్చు. ఇప్పటికే అటువంటి పథకాలు

## నీరు - మీరు సాగిన తీరు

అమలులో లేని ఊళ్ళలో ఈ కరవు సీజన్‌లో జరిగిన 'నీరు—మీరు' జన్మభూమిలో వాటికి నాందిపలికి ఉంటారని అమాయకులు ఆశించి ఉండవచ్చు.

కానీ, కరవు తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో సైతం ఏ ఒక్క గ్రామంలోనూ ఇది జరిగినట్టు కనిపించదు. మరి మొన్నటి జన్మభూమిలో ఏం జరిగిందని ప్రశ్నిస్తే, 'ఎండలో వచ్చిన అధికారులకు చెమటలు తుడుచుకునే దానికే సరిపోయింద'ని ఒక ఊళ్ళో, 'ముసలివాళ్ల పెన్షన్ చెక్కులు కొన్ని పంచి దానితో జనం మధ్య కొట్లాటలు పెట్టి జీపెక్కి వెళ్లిపోయినార'ని ఇంకొక ఊళ్ళో, 'గతంలో జరిగిన జన్మభూమిలో వేయిస్తామని చెప్పిన రోడ్డు సంగతి ఏమయిందని మేము అడిగినామని చెప్పి మామీద అలిగివెళ్లిపోయినార'ని మరొక ఊళ్ళో జవాబు చెబుతున్నారు. నీటి వనరుల పేరుమీద జరిగిన జన్మభూమి అత్యధిక గ్రామాలలో నీటి గురించి ఒక్కప్రణాళిక కూడా రూపొందించకుండా గడచిపోయింది.

గ్రామస్థులు ఎంతశ్రమదానం చేసినప్పటికీ అన్ని ప్రాంతాలలో ప్రతిగ్రామంలో భూగర్భజలాల పెంపుదలకు ప్రణాళికలు ఒకేసారి రూపొందించిపని మొదలు పెట్టడం ప్రభుత్వానికి ఆర్థికంగా సాధ్యంకాకపోవచ్చు. కానీ కరవు తీవ్రతను బట్టి ప్రాధాన్యతా క్రమంలో ఎంపికచేసుకొని ఈ సంవత్సరం మొదలుపెట్టగలిగినవి ఈ సంవత్సరం, మిగిలినవి మళ్లీ అదే ప్రాధాన్యతాక్రమాన్ని బట్టి వచ్చే సంవత్సరం, ఆ తదుపరి సంవత్సరం... చేపట్టవచ్చు. రైతులకు ఈ విషయం వివరించి చెప్పి ఒక టైంటేబుల్ రూపొందించి ఉండవచ్చు. తమ గ్రామాల్లో కంటె కరవు తీవ్రంగా ఉన్న గ్రామాలలో కరవు నివారణ చర్యలు మొదట ప్రారంభించడాన్ని వ్యతిరేకించేంత మూర్ఖులు ఎవరో కొందరు మాత్రమే ఉంటారు. కానీ ఎడారి అయిపోతున్నదని పత్రికలన్నీ ఘోషిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా గట్టు మండలంలో సైతం ఏ ఒక్క గ్రామంలోనూ ఒక కొత్త పథకం చేపట్టడానికి నిర్ణయం చేయకుండా ముగిసిన నీటి జన్మభూమిని గురించి ఏమనాలి?

కరవును రాజకీయం చేయొద్దు అని ముఖ్యమంత్రి అంటుంటారు. రాజకీయం అనేదొక అసభ్యమైన పని అయినట్టు మాట్లాడే రాజకీయ నాయకుడు



బహుశా ఈయనొక్కరేనేమో. ఆయన ఏ అసభ్యమైన అర్థంలో రాజకీయం అనే మాటను వాడుతున్నారో ఆ అర్థంలో ప్రజల ఆకాంక్షలన్నిటినీ తెలివిగా 'రాజకీయం' చేయడం వల్లనే ఆయన అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు అదే అర్థంలో కరవును రాజకీయం చేస్తున్నారు. గత సంవత్సరం వర్షాకాలపు పంట ప్రస్తుత కరవు ప్రాంతాలన్నిటిలోనూ బాగా దెబ్బతింది. నైరుతి రుతుపవనాలపైన ఆధారపడే దక్షిణ జిల్లాలలోనయితే చాలావరకు పంటలే వేయలేదు. కాబట్టి ఈ వేసవి వచ్చేనాటికి మనుషులకు తాగు నీరు, చేయడానికి పని, పశువులకు మేత కరవవుతాయని ప్రభుత్వం ఊహించే ఉండాలి. అయినప్పటికీ ఈ కొరతను నివారించడానికి ఏమీ చేయలేదు. దీనికి సంజాయిషీ ఏమీ చెప్పుకోకుండా కరవు మధ్యలో నీటి సంరక్షణ గురించి ఊదరగొట్టే ప్రచారం చేయడాన్ని ఆయన ప్రయోగించే అసభ్యమైన అర్థంలో 'రాజకీయం' అనకపోతే ఏమనాలి? నిన్నటి దాకా పశువులకు మేత సరఫరా ఎక్కడా చేయలేదు, ప్రజలకు పనులు కల్పించడానికి కార్యక్రమాలెక్కడో తప్ప చేపట్టలేదు, చేపట్టిన దగ్గర కూడా పెట్టుబడి ఆదా చేయడానికి మానవ శ్రమ బదులు ప్రొక్లెయిన్లు వాడి ప్రజల నోట్లో దుమ్ము కొడుతున్నారు. పైగా 'ప్రొక్లెయిన్లు అవసరమైతే పొరుగు రాష్ట్రాలనుండి అరువు తెచ్చుకొని వాడాలి. ఎక్కువమందికి పని కల్పించాలి' అంటూ చంద్రబాబు పొంతనలేని అసంబద్ధపు ప్రకటనలిస్తున్నారు. సాగునీటి సంగతి దేవుడెరుగు, కనీసం తాగునీటికి కూడా కొత్తగా ఏర్పాట్లు చేసిన గ్రామాలు వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఒక్కొక్క ఊరిలో ప్రజలు తమకు తోచిన ప్రత్యామ్నాయాలు వెతుక్కొని రోజంతా మంచి నీళ్లు సేకరించుకోవడంలోనే గడుపుతున్నారు. ఈ మధ్యలో 'నీరు—మీరు'వచ్చింది. పోయింది. 'నీరు మీకర్మ — దొరకపుచ్చుకో గలిగితే దొరకపుచ్చుకోండి, లేకపోతే లేదు' అని దీని అర్థం అనుకోవాలి. భూగర్భజలాలన్నీ ఇంకిపోయి ఉన్న ఈ వేసవిలో ప్రభుత్వం మాత్రం నీళ్లెక్కడినుండి తీసుకొస్తుందని అడగచ్చు. ఇప్పుడు అకస్మాత్తుగా తీసుకురాలేదు. కానీ ఈ స్థితి ఈ వేసవిలో వస్తుందని కనీసం మొన్నటి డిసెంబర్ నాటికే అందరికీ తెలుసు. కనీసం ఉన్న మేరు మంచినీటి వ్యవస్థను పటిష్టం చేసుకోవలసి ఉండింది. కానీ నీళ్ల ట్యాంకు కట్టికూడా దానికి బోరువేయని గ్రామాలను, రెండూ ఉండి పైప్‌లైన్లు వేయని గ్రామాలను, మూడూ ఉండి కరెంటు లోటువల్ల ట్యాంకులోకి నీరెక్కని గ్రామాలు, అన్నీ ఉండి ఆ నీటిలో ఫ్లోరైడ్ కాలుష్యం మితిమీరి ఉండడం వల్ల అవి తాగి ప్రజలు ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్న గ్రామాలను చూస్తే ఈ ఆరునెలలలో ఏరకమైన జాగ్రత్త చర్యలూ ప్రభుత్వం తీసుకోలేదని అర్థమవుతుంది. గ్రామస్థులే ఎవరో ఒక రైతును అడుక్కొని తన పొలంలోని బావినీరు తాగడానికి ఇమ్మని కోరడం, ఆ రైతు తన బావిలో మిగిలిఉన్న కొద్దిపాటి నీటిని వేసంగి పంటకు కాకుండ గ్రామస్థులు తాగడానికి కేటాయించడానికి ఇష్టపడక తగాదా పెట్టుకోవడం అనేక గ్రామాలలో జరుగుతున్నది. ప్రభుత్వమే అటువంటి రైతులకు ఎంతో కొంత నీటి కిరాయి చెల్లించి వారి బావులనుండి ఊరి ట్యాంకులోకి లేక నల్లాలలోకి నీళ్లు పారించే ఏర్పాటు చేసి ఉండవచ్చు. ఏ ఒక్క గ్రామాలలోనూ ఇది జరగలేదు.

అయినప్పటికీ నీటివనరుల సంరక్షణ గురించి ఒక జాతర పద్ధతిలో ప్రచారం చేసుకొని అన్నా హజారే వంటి పెద్దలను పిలిచి మెప్పుకోలు సాధించుకోవడాన్ని రాజకీయం అనకపోతే దగా అనాలి. ముఖ్యమంత్రి ఆ రెండు మాటలనూ ఒకే అర్థంలో ప్రయోగిస్తున్నారు కాబట్టి రెండూ అనవచ్చు.